# సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 9 । జూలై । 2024




## మేడమ్.. వెళ్లొద్దు ప్లీజ్

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వోరగంటి పద్మకళ బదిలీ కాగా.. విద్యార్థులు వెళ్లొద్దు మేడమ్ అంటూ రోదించారు. ముస్తాబాద్‌లో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న పద్మకళ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పనిచేసి 30 మంది విద్యార్థులతో ఉన్న స్కూల్‌లో పిల్లల సంఖ్యను వందకు పెంచారు. పద్మకళ నామాపూర్ స్కూల్‌కు బదిలీకాగా.. సోమవారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా చివరి రోజు స్కూల్ నుంచి వెళ్తుండగా విద్యార్థులు కంట తడి పెట్టారు. విద్యార్థులకు నచ్చజెప్పి వెళ్తూ భావోద్వేగానికి గురయ్యారు.



## న్యూస్‌రీల్

### ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా స్వప్న



సిరిసిల్లకల్చరల్: ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌గా డి.స్వప్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈడీగా విధులు నిర్వహించిన అజ్మీర వినోద్‌కుమార్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు.

### వ్యాయామంతోనే ఆరోగ్యం



వ్యాయామం చేస్తున్న ఏఎస్పీ చంద్రయ్య

సిరిసిల్లక్రైం: పోలీసులు ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం చేయాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. సిరిసిల్ల టౌన్ ఠాణాలోని పోలీసు అధికారులకు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన జిమ్‌ను సోమవారం ప్రారంభించారు. విధి నిర్వహణతోపాటు ఆరోగ్యంగా ఉండడం కూడా ముఖ్యమేనన్నారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐలు మధూకర్, యాదగిరి, సీఐలు కృష్ణ, మొగిలి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

### బోసిపోయిన రాజన్న ఆలయం



వేములవాడ: ఆషాఢ మాసం ఆరంభం కావడంతో రాజన్న దర్శనానికి భక్తులు అంతంతే వస్తున్నారు. ఫలితంగా ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు భక్తులు లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. ఈనెల 17న ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆలయాన్ని మామిడి తోరణాలు, రంగురంగుల పూలతో సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

**రేపు, ఎల్లుండి హుండీ లెక్కింపు**

రాజన్న హుండీ లెక్కింపును మంగళ, బుధవారాల్లో చేపడుతున్నట్లు ఈవో తెలిపారు. అధికారులు, సిబ్బంది సకాలంలో ఓపెన్‌స్లాబ్‌లో హాజరుకావాలని ఆదేశించారు.

### ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత



వేములవాడరూరల్: మూలవాగు నుంచి ఇసుకను తోడితే వ్యవసాయబావులు అడుగంటిపోతున్నాయంటూ వేములవాడరూరల్ మండలంలోని మల్లారం గ్రామ రైతులు సోమవారం ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇసును తోడితే తమ వ్యవసాయ బావులు ఎండిపోతున్నాయన్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతుల ఫిర్యాదుతో ట్రాక్టర్లను పంపించి వేశారు. ఈ విషయంపై తహసీల్దార్ సుజాతను వివరణ కోరగా అనుమతులు ఇచ్చామని, రైతులు అభ్యంతరం తెలపడంతో నిలుపుదల చేసినట్లు తెలిపారు.

### బదిలీలు సాధారణం



సిరిసిల్లటౌన్: ఉద్యోగులకు బదిలీలు సాధారణమని.. సేవలు శాశ్వతమని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వెంకంపేట హైస్కూల్‌లో సుదీర్ఘకాలం పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు, పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సోమవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఉపాధ్యాయులు సమసమాజ నిర్మాతలు అని అభివర్ణించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బీఆర్‌ఎస్ నాయకుడు కల్లూరి మధును పరామర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కౌన్సిలర్ కల్లూరి రాజు, కేడీసీసీబీ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, ఎంఈవో దూస రఘుపతి, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో వైఎస్సార్

వేములవాడ: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో గూడు కట్టుకుని ఉన్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకుని వేములవాడలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, నాయకులు సాగారం వెంకటస్వామి, సంగ స్వామియాదవ్, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, చిలుక రమేశ్, తూం మధు, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేశ్, పాత సత్యలక్ష్మి, తోట లహరి, బొజ్జ భారతి, ముప్పిడి శ్రీనివాస్, నాగుల మహేశ్, విష్ణు, రజాక్, పీర్ మహమ్మద్, బాబూన్, రాజు, ఫిరోజ్, వెంకన్న పాల్గొన్నారు.



## ప్రమాదమని తెలిసినా..

వేములవాడ: ఓ వైపు వర్షం.. మరోవైపు రోడ్డుపై బురద. ఇలాంటి పరిస్థితుల్లో బండిపై ప్రయాణించడమంటేనే ప్రమాదం వెంట వెళ్తున్నట్లు. కానీ వేములవాడలో సోమవారం ఉదయం వర్షం కురుస్తుండగా ఇలా బైక్‌పై ఆరుగురు ప్రమాదకరంగా వెళ్తున్నారు.



# యువత పెడదారి

'ముస్తాబాద్ మండలానికి చెందిన ఓ యువ వ్యాపారి ఆరేళ్ల క్రితం క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. ఐపీఎల్ బెట్టింగ్‌లో ఒక్కసారి డబ్బులు పొందితే పది సార్లు పోగొట్టుకునేవాడు. పోలీస్ నిఘా పెరగడంతో రెండేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెడుతున్నాడు. అప్పటి నుంచి ప్రపంచంలో ఎక్కడ క్రికెట్ పోటీలు జరిగిన ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు దిగేవాడు. ఇలా లక్షలాది రూపాయలు నష్టపోయాడు. వ్యాపారం దివాళ తీసింది. కుటుంబ సభ్యుల మధ్య వివాదం తలెత్తింది. కుటుంబం చిన్నాభిన్నమైంది. ఇలా బెట్టింగ్ మోజులో అన్ని కోల్పోయిన యువకులు జిల్లాలో చాలా మంది ఉన్నారు.

'సిరిసిల్లకు చెందిన ఓ యువకుడు పేకాటను వృత్తిగా తీసుకున్నాడు. ముస్తాబాద్, సిద్దిపేట, కామారెడ్డి వంటి పట్టణాల్లో పేకాట ఆడేందుకు వెళ్లేవాడు. పోలీస్ నిఘా పెరిగినప్పుడు మహారాష్ట్రకు వెళ్లి ఆడి వచ్చేవాడు. ఇలా లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నాడు. ఇప్పుడు బికారిగా మిగిలాడు.'

'ముస్తాబాద్ మండలానికి చెందిన ఓ వ్యాపారి ఇరవై ఏళ్ల క్రితం పేకాట ఆడి అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నాడు.' ఇప్పటికీ జిల్లా నుంచి గోవా, మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ప్రాంతాలకు కార్లలో వెళ్లి పేకాట ఆడేవారు ఉన్నారు.

- గంజాయి, పేకాట, బెట్టింగ్‌లతో చిత్తు
- వ్యసనాల కోరల్లో చిక్కుకుంటున్న వైనం
- రోడ్డున పడుతున్న జీవితాలు
- రెండున్నరేళ్లలో 359 మంది పేకాటరాయుళ్లపై కేసు
- గంజాయి కేసుల్లో 291 మంది జైలుకు
- అయినా మారని తీరు



గంజాయితో పోలీసులకు దొరికిన యువకులు (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): యువతరం పెడదారి పడుతోంది. మత్తులో చిత్తవుతుంది. తాత్కాలిక ఆనందాల కోసం భవిష్యత్‌ను నాశనం చేసుకుంటుంది. గంజాయి, పేకాట, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో జీవితాలను రోడ్డుపాలు చేసుకుంటుంది. వ్యసనాలకు అలవాటుపడి చదువుకోలేకపోతున్నారు. ఫలితంగా భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారు. అంతేకాకుండా కటకటాలపాలవుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత ఆరు నెలల్లో 41 గంజాయి కేసుల్లో 99 మంది అరెస్టయ్యారు. పేకాట ఆడుతూ పట్టుబడ్డ సంఘటనల్లో ఇప్పటి వరకు 20 కేసులు నమోదయ్యాయి. వీటితోపాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు.

**మత్తుతో చిత్తవుతున్న జీవితాలు**

జిల్లాలో గంజాయి మత్తు ఆందోళన రేకెత్తిస్తుంది. సిరిసిల్ల వంటి కార్మికక్షేత్రంలో గంజాయికి యువత ఆకర్షితులవుతున్నారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా అవుతుందని తెలుస్తోంది. ముఖ్యంగా కాలేజీ విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారుతున్నారు. ఇందుకు ఉదాహరణే ఈ సంఘటన. గూడెం గ్రామానికి చెందిన ఓ యువకుడిని తల్లిదండ్రులు హైదరాబాద్‌లో బీటెక్‌లో చేర్పించారు. అక్కడ ఆ యువకుడు గంజాయికి అలవాటు పడి, చివరికి పెడ్లర్‌గా మారాడు. గంజాయి తరలిస్తూ మానకొండూర్‌లో పోలీసులకు చిక్కాడు. ఇంజినీరింగ్ చేస్తున్నాడని భావించిన ఆ తల్లిదండ్రులకు కొడుకు గంజాయికి బానిసగా మారాడని తెలిసి తల్లడిల్లుతున్నారు. తమ కలలను చిదిమేశాడని ఆవేదన చెందుతున్నారు.

**గంజాయి కేసుల వివరాలు**

| సంవత్సరం | కేసులు | సీజ్ చేసినవి | అరెస్టు |
|---|---|---|---|
| 2022 | 16 | 3.50 కిలోలు | 51 |
| 2023 | 61 | 71.794 కిలోలు | 141 |
| 2024 | 41 | 34.150 కిలోలు | 99 |

**పేకాట, గేమింగ్ కేసులు**

| సంవత్సరం | కేసులు | అరెస్టు |
|---|---|---|
| 2022 | 12 | 83 |
| 2023 | 26 | 158 |
| 2024 | 20 | 118 |



గంజాయితో పట్టుబడ్డ యువకుడు (ఫైల్)

### ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



యువత పెడదారి పట్టవద్దు. ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలి. గంజాయి, పేకాట, బెట్టింగ్ నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులకు, యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళాలు పెట్టాం. వ్యసనాలకు దూరంగా ఉండేలా ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టాం. దేశం, తల్లిదండ్రులు గర్వించేలా యువత కెరీర్‌ను మలచుకొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

### తల్లిదండ్రులదే బాధ్యత



పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలి. కాలేజీకి వెళ్తున్నారా? లేదా? చూడాలి. కాలేజీలో లెక్చరర్స్‌తో మాట్లాడాలి. హాస్టల్‌లో ఉంటే వార్డెన్‌తో తరచూ పిల్లల ప్రవర్తనపై ఆరా తీయాలి. మత్తు పదార్థాలకు, బెట్టింగ్‌లకు అలవాటు పడితే కౌన్సెలింగ్ నిర్వహించాలి.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

# అభివృద్ధిపై దృష్టి పెడదాం



భూమి పూజ చేస్తున్న మంత్రి బండి సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

- రాజకీయ ఆరోపణలు బంద్ చేద్దాం
- కేంద్ర, రాష్ట్రాల సమన్వయం అవసరం
- గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధికి చిహ్నం
- కేంద్రం తరఫున సంపూర్ణ సహకారం
- కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

సిరిసిల్లటౌన్/ముస్తాబాద్/వీర్నపల్లి/తంగళ్లపల్లి (సిరిసిల్ల): ఇకపై రాజకీయ ఆరోపణలు.. తిట్లు బంద్ చేసి, అభివృద్ధిపై దృష్టి పెడదామని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కలిసి వస్తే అభివృద్ధిపై ఫోకస్ పెడదామన్నారు. ఎలక్షన్లు అయిపోయినాయని.. ఏకతాటిపైకి వచ్చి పనిచేద్దామని పిలుపునిచ్చారు. సిరిసిల్లలోని మున్నూరుకాపు సంఘంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం భూమి పూజ చేశారు. అనంతరం సిరిసిల్ల నియోజకవర్గస్థాయిలోని మున్నూరుకాపు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రెండోసారి బంపర్ మెజార్టీతో గెలిపించిన కరీంనగర్ ప్రజల రుణం తీర్చుకునేలా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.

**అన్ని కులసంఘాలకు నిధులు**

సిరిసిల్ల మున్నూరుకాపు కల్యాణ మండపానికి రూ.లక్ష ఎంపీలాడ్స్ నిధులు కేటాయించామని మరిన్ని నిధులు కూడా అందిస్తామన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి నిధులు అందిస్తానని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జయంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పర్కాల నవీన్‌లకు హామీ ఇచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, పట్టణ కన్వీనర్ అగ్గి రాములు, కౌన్సిలర్ కల్లూరి రాజు, ఎర్రం మహేశ్, దుమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో ఎస్సీ కాలనీలో గ్రామైక్య మహిళా భవన ప్రహరీ నిర్మాణానికి కేంద్ర హోం సహాయమంత్రి బండి సంజయ్ భూమిపూజ చేసి మొక్క నాటారు. బీజేపీ మండలాధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, హన్మంత్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, క్రాంతి, సంతోష్‌రెడ్డి, యెల్ల గిరి, కోల కృష్ణ, వరి వెంకటేష్, మహేశ్, సుధాకర్‌రెడ్డి, పద్మ, మహేందర్, నరేశ్, ఆది లక్ష్మణ్ పాల్గొన్నారు.

**బీడీ కార్మికుల పెన్షన్లు పెంచాలి**

విరమణ చేసిన బీడీ కార్మికులకు కేంద్రం అందించే పెన్షన్లు పెంచాలని కోరుతూ తెలంగాణ బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బద్దెపూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ప్రతీ నెల ఈపీఎఫ్ ద్వారా రూ.500 నుంచి రూ.900 మాత్రమే వస్తున్నాయని, ఈ డబ్బులు కనీసం మందులకు కూడా సరిపోవడం లేదన్నారు. నెలకు రూ.5వేలకు పెంచాలని కోరారు. టేకేదారులు రంగయ్య, కొంక రాజు, యాదారపు రాజు, సత్యనారాయణ, వెంకటేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

**సంఘ భవనాలకు భూమి పూజ**

వీర్నపల్లి మండలం వన్‌పల్లి, శాంతినగర్ గ్రామాల్లో కులసంఘాల భవనాలకు బండి సంజయ్ భూమి పూజ చేశారు. శాంతినగర్‌లో ఎస్టీ, రెడ్డి సంఘాల భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి భోజనం చేశారు. గర్జనపల్లిలో శుద్ధ జల కేంద్రానికి భూమిపూజ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు గునుకుల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**గౌడసంఘం భవనానికి భూమిపూజ**

తంగళ్లపల్లిలోని గౌడసంఘం భవన నిర్మాణానికి బండి సంజయ్‌కుమార్ భూమిపూజ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, పూర్మాణి రాంలింగారెడ్డి, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, నులుగొండ శ్రీనివాస్, గజభీంకార్ సంతోష్, కాళీచరణ్, అన్నల్‌దాస్ వేణు, మల్లడపెట భాస్కర్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఊపందుకున్న 'ఎన్‌హెచ్-563'

- కిలోమీటర్ రహదారి పనులకు రూ.37 కోట్లు ఖర్చు
- ఏడాదిలోగా వరంగల్–కరీంనగర్ సెక్షన్ అందుబాటులోకి..
- కరీంనగర్–జగిత్యాల పనులకు రూ.2,227 కోట్లు
- 59 కి.మీ. మేర ఫోర్‌లేన్ రహదారి
- నిత్యం సమీక్షిస్తున్న కేంద్రమంత్రి సంజయ్



గట్టుదుద్దెనపల్లి సమీపంలో టోల్‌గేట్ పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రను కలిపే జాతీయ రహదారి–563 పనుల్లో ముందడుగు పడనుంది. గతంలో 'భారత్ మాలా పరియోజన' కింద ప్రారంభించిన ఈ రహదారిని ప్రస్తుతం 'మోదీ 100 రోజుల యాక్షన్‌ప్లాన్' కిందికి మార్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 127 కి.మీ. మేర నిర్మాణం జరుగుతోంది. గతేడాది నుంచే కరీంనగర్–వరంగల్ సెక్షన్‌లో పనులు మొదలయ్యాయి. ఈ రెండు నగరాల మధ్య 68 కి.మీ. నిర్మిస్తున్న రహదారి పనులు ఊపందుకున్నాయి. వచ్చే ఏడాది జూలై 16 నాటికి పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు భావిస్తున్నారు. భూసేకరణలో చిన్నాచితక సమస్యలు మినహా ఎలాంటి అడ్డంకులు లేవు. గట్టుదుద్దెనపల్లి సమీపంలో టోల్‌గేట్ పనులు కూడా చకచకా జరుగుతున్నాయి. మరోవైపు ఇరుకుల్ల వాగుపై వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. కల్వర్టులు, మేజర్, మైనర్ జంక్షన్లు, బైపాస్ (మానకొండూరు, తాడికల్, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి బైపాస్)లు నిర్మిస్తున్నారు.

**2 వారాల్లో జగిత్యాల సెక్షన్‌లో టెండర్**

కరీంనగర్–జగిత్యాల సెక్షన్‌లో 2 రెండు వారాల్లో టెండర్ పనులు మొదలు కానున్నాయి. మొత్తం 58.8 కి.మీ. ఉన్న ఈ రహదారికి రూ.2,227 కోట్ల వరకు ఖర్చు కానున్నాయి. ప్రతీ కిలోమీటరుకు అధికారులు రూ.37 కోట్లు ఖర్చు(జీఎస్టీతో కలిపి) ఖర్చు చేయనున్నారు. రూ.2,227 కోట్లలో 241 హెక్టార్ల భూసేకరణకు రూ.387.15 కోట్లు కేటాయించారు. ఈ రహదారి నిర్మాణ అంచనా వ్యయం రూ.1,503.73 కోట్లు మాత్రమే. దీనికి జీఎస్టీ, భూసేకరణ కలుపుకొని పై మొత్తానికి చేరింది. ఇవే కాకుండా, గంగాధర సమీపంలోని తుర్కాశీనగర్ పొలిమేరలో టోల్‌గేట్ నిర్మిస్తున్నారు. ఇక్కడి నుంచి 2 కిలోమీటర్లు దాటాక ట్రక్కులు ఆగేందుకు ట్రక్ బే నిర్మించనున్నారు. అలాగే, జగిత్యాల సమీపంలో డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు రెస్ట్ ఏరియాను కూడా అందుబాటులోకి తీసుకువస్తారు. ఆయా పనులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నిత్యం సమీక్షిస్తున్నారు.

**మాది చేతల ప్రభుత్వం**

ప్రతీ కిలోమీటరుకు రూ.37 కోట్లు ఖర్చు చేయడం బీజేపీ, ప్రధాని మోదీ సర్కారు సంకల్పానికి నిదర్శనం. మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం. మేమెప్పుడూ మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తాం. ఇప్పటికే వీలైనంత తర్వగా టెండర్లు పూర్తి చేసి, పనులు ప్రారంభించాలని ఆదేశించాం. వచ్చే ఏడాది వరంగల్–కరీంనగర్ సెక్షన్ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అంతర్జాతీయ స్థాయిలో ఫోర్ లేన్ రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– బండి సంజయ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి

**వరంగల్–కరీంనగర్ సెక్షన్**

| | |
|---|---|
| దూరం: | 68 కి.మీ. |
| అంచనా వ్యయం: | రూ.1,647 కోట్లు |
| గడువు తేదీ: | 16–7–2025 (730 రోజులు) |
| మానకొండూరు బైపాస్: | 9.44 కి.మీ. |
| తాడికల్ బైపాస్: | 6.65 కి.మీ. |
| హుజురాబాద్ బైపాస్ : | 15.05 కి.మీ. |
| ఎల్కతుర్తి బైపాస్ : | 4.60 కి.మీ. |
| హసన్‌పర్తి బైపాస్: | 9.57 కి.మీ. |
| మైనర్ జంక్షన్లు: | 29 |

**కరీంనగర్–జగిత్యాల సెక్షన్**

| | |
|---|---|
| దూరం : | 58.8 కి.మీ. |
| అంచనా వ్యయం: | రూ.2,227 కోట్లు |
| బ్రిడ్జిలు: | 24 (18 మైనర్, 06 మేజర్) |
| ఆర్వోబీ/ఆర్‌యూబీ: | 03 |
| మేజర్ జంక్షన్లు: | 27 |
| మైనర్ జంక్షన్లు: | 29 |
| టోల్‌ప్లాజా: | గంగాధర–తుర్కాశీనగర్ సమీపంలో |
| ట్రక్ బే: | టోల్‌గేట్ సమీపంలో |
| రెస్ట్ ఏరియా: | జగిత్యాల సమీపంలో |

## ప్రజా'వాణి'పై నిర్లక్ష్యం వద్దు



సిరిసిల్లటౌన్: ప్రజావాణి ఫిర్యాదులపై జిల్లా అధికారులు జవాబుదారీగా పనిచేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని సూచించారు.

**312 వినతులు**

ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల బాధితుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ కష్టాలపై 212 కలెక్టర్‌కు ఫిర్యాదులు అందించారు. రెవెన్యూ 35, సెస్ 208, డీఎంహెచ్‌వో 2, డీపీవో 10, సర్వే ఏడీ 4, సిరిసిల్ల మున్సిపల్ 14, ఎస్పీ ఆఫీస్ 1, డీడబ్ల్యూవో 2, ఉపాధి కల్పన 15, ఎస్‌డీసీ 4, ఎంపీడీవో కోనరావుపేట, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, వేములవాడ 10, డీసీవో, బీసీడీవో, ఎల్‌డీఎం, డీఆర్‌డీవో, ఇరిగేషన్, వేములవాడ మున్సిపల్, ఎక్సైజ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఒక్కో దరఖాస్తు చొప్పున మొత్తంగా 312 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### డ్రెయినేజీలు శుభ్రం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలో పేరుకుపోయిన డ్రెయినేజీలను శుభ్రం చేయడంతోపాటు, మంచినీటి ట్యాంక్‌ల వెంట అధికారులు బ్లీచింగ్ చల్లారు. 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన 'పడకేసిన పాలన' కథనానికి డీఎల్పీవో స్పందించారు. ఎంపీడీవోతోపాటు పంచాయతీ అధికారులను అప్రమత్తం చేశారు. ఎల్లారెడ్డిపేటలో డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. గ్రామంలో వీధుల వెంట పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. ఎంపీవో వజీర్ మాట్లాడుతూ వారానికోసారి తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయడంతోపాటు నిత్యం డ్రెయినేజీలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. కార్యదర్శి దేవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం

ముత్తారం(మంథని): వ్యవసాయ బావిలో ఓ మహిళ మృతదేహం లభ్యమైందని, సంచిలో మూటకట్టి పడేశారని ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ముత్తారానికి చెందిన దుండ్ర రవికుమార్ అనే రైతు సోమవారం నారుమడికి నీరు పెట్టడానికి వెళ్లాడు. ముత్తారం నుంచి పారుపల్లికి వెళ్లే రోడ్డులో గుర్రాలవాగు సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో ఏదో మూట తేలి ఉండటాన్ని గమనించాడు. లోపలికి దిగి, అందులో ఉన్నది మృతదేహమని గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మధుసూదన్‌రావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి వయసు 50 ఏళ్ల వరకు ఉంటుందని, గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచేందుకు పంపినట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఆమె స్థానిక, చుట్టుపక్కల మహిళ అయి ఉండదని, ఎక్కడో చంపి, ఇక్కడికి తీసుకొచ్చి పడేసి ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

### పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

రామడుగు(చొప్పదండి): గోపాల్‌రావుపేట, దేశరాజ్‌పల్లి పంచాయతీ కార్యదర్శులను సోమవారం సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. గోపాల్‌రావుపేట కార్యదర్శి ఎండీ పాషా విధులను నిర్లక్ష్యం చేయగా, దేశరాజ్‌పల్లి కార్యదర్శి సంతోష్ నిబంధనలకు విరుద్ధంగా ఇంటి రశీదు ఇవ్వడంతో విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. దీంతో ఇద్దరిని సస్పెండ్ చేశారు.



# సంస్కృతికి ప్రతీక.. 'సీత్లా'

- నేడు సీత్లా భవాని పండుగ
- వేడుకలకు సిద్ధమైన గిరిజనులు
- అమ్మవారికి బోనాలు..
- ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న యువతుల నృత్యాలు
- రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 126 తండాల్లో ఒకే రోజు పూజలు





పూజలు చేస్తున్న గిరిజనులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి(సిరిసిల్ల): సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక.. గిరిజనుల ఆరాధ్య దైవం సీత్లా భవాని పండుగ రానేవచ్చింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 126 తండాల్లో ఒకేరోజు ఈ నెల 9వ తేదీన(మంగళవారం) జరపాలని బంజారా సేవా సంఘం జిల్లా ప్రతినిధులు నిర్ణయించారు. దీంతో వేడుకలకు తండాలు ముస్తాబయ్యాయి. ఈ పండుగను చిన్నాపెద్ద అందరూ కలిసి ఆనందంగా జరుపుకుంటారు. గిరిజన యువతుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ పండుగకు ఉపాధి, ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన గిరిజనులందరూ తరలివస్తారు.

**పశుపోషణ ఆధారంగా జీవనం**

పూర్వకాలం నుంచి పశుపోషణకు గిరిజనులు పెట్టింది పేరు. పశువులకు గడ్డి బాగా లభించే ప్రాంతాలను ఎంచుకొని తండాలుగా ఏర్పాటు చేసుకొని, అక్కడే జీవనం సాగించేవారు. గ్రామాలకు దూరంగా అడవుల్లో నివసించడంతో వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడల్లా జీవాలు రోగాల బారిన పడేవి. వానాకాలం ప్రారంభం కాగానే తండాల్లోని పశువులు వందల సంఖ్యలో జ్వరం, విరేచనాలు, కాలుడెక్కలు చెడిపోవడం, నోరుచెడి మేత మేయకపోవడం వంటి లక్షణాలతో చనిపోయేవి. దీన్ని లాళీ(గాలికుంటువ్యాధి)గా పిలిచేవారు.

**గిరిజన పెద్ద కలలోకి సీత్లా మాత..**

పశువులు మరణిస్తూ బాధపడుతున్న తరుణంలో పూర్వం ఓ గిరిజన పెద్ద కలలోకి గిరిజనుల ఏడుగురు దేవతల్లో చిన్నదైన సీత్లా దేవత కనిపించి, తనను పూజిస్తే పశుసంపద దక్కుతుందని చెబుతుంది. అప్పటినుంచి గిరిజనతండాల్లో ఏటా ఈ పండుగను జరుపుకుంటున్నారు. ఏడుగురు దేవతలైన మేరామ, తుల్జా, మాత్రాల్, కంకాళి, హీంగ్లా, ద్వాళాంగర్, సీత్లా మాతలను పూజిస్తారు. వీరికి రక్షణగా ఉండే లుంకడ్యాను సైతం కొలుస్తారు.

**ఆకట్టుకునే పూజా విధానం**

వానాకాలం ప్రారంభమయ్యాక పునర్వసు కార్తె జూలై నెలలో గిరిజనులు సీత్లా మాతను కొలుస్తారు. అన్ని పండుగల వలే ఇళ్లలో కాకుండా తండాకు దగ్గరలో ఉండే చెరువు ఒడ్డున పూజలు చేస్తారు. పొడవాటి రాళ్లతో తయారు చేసిన ఏడు ప్రతిమలను ఒకే వరుసలో ప్రతిష్ఠించి, వాటికి ఎదురుగా 100 అడుగుల దూరంలో లుంకడ్యా ప్రతిమను ఏర్పాటు చేస్తారు.

**వాంసిడో(నైవేద్యం) సమర్పణ..**

అమ్మవార్ల ప్రతిమలను జాజు, పూలు, మామిడాకులతో అలంకరిస్తారు. యువతులు ఒకరోజు ముందు జొన్నలు, పప్పుధాన్యాలను నానబెట్టి, తయారు చేసిన వాంసిడో(నైవేద్యం)ను సమర్పించి, తమకు మంచి వరుడు దొరకాలని కోరుకుంటారు. ఈ సందర్భంగా వారి సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అనంతరం గిరిజనులు మేకలు, గొర్రెలను బలిచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు. వాటి ప్రేగులను దేవతా ప్రతిమల నుంచి లుంకడ్యా ప్రతిమ వరకు పరుస్తారు. వాటి మీద నుంచి పశువులను దాటిస్తారు. దీన్ని దాటుడు పండుగగా పిలుస్తారు.

**కోరికలు తీరుతాయి**



సీత్లా భవాని అమ్మవారిని కొలిస్తే కోరికలు తీరుతాయి. పశు సంపద ఆరోగ్యంగా ఉండాలని, పంటలు పండాలని నైవేద్యం సమర్పించి, పూజలు చేస్తాం. ప్రతీ సంవత్సరం ఈ నెలలో పండుగ జరుపుకుంటున్నాం.

– అజ్మీరా ఛమ్‌కుబాయి, బుగ్గరాజేశ్వరతండా

**గతంలో రెండు వారాలపాటు..**



జిల్లాలోని అన్ని తండాల్లో ఒకేరోజు సీత్లా భవాని వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించాం. గతంలో రెండు వారాలపాటు జరుపుకునేవాళ్లం. ఈ ఏడాది ఒక్కరోజే ఈ నెల 9న మంగళవారం నిర్వహించాలని తీర్మానించాం.

– భూక్య శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్, గుండారం

**సెలవు ప్రకటించాలి**



గిరిజనుల సీత్లా భవాని పండుగకు ప్రభుత్వం గుర్తింపునివ్వాలి. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా అన్ని తండాల్లో మంగళవారం వేడుకలు జరుపుకుంటున్నాం. పునర్వసు కార్తె మొదటి మంగళవారాన్ని సెలవు దినంగా ప్రకటించాలి.

– గుగులోత్ రవిలాల్‌నాయక్, మద్దిమల్ల

## కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాస్పత్రి తనిఖీ



ఎన్‌హెచ్‌ఎం బృందంతో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఆస్పత్రి అధికారులు

కరీంనగర్‌టౌన్: నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ఢిల్లీ బృందం సోమవారం కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాస్పత్రిని తనిఖీ చేసింది. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్(ఐపీహెచ్‌ఎస్) ప్రకారం కరీంనగర్ ఆస్పత్రి 80 శాతం కంటే ఎక్కువ స్కోరు చేసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు పి.కన్నన్, దీపాలికౌశిక్ దవాఖానా నిర్వహణ ఐపీహెచ్‌ఎస్ నిబంధనల ప్రకారం ఉందా.. లేదా అన్నది పరిశీలించారు. 500 పడకల ఆస్పత్రిలో ఉండాల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు, వసతులు, సరిపడా వైద్యులు, సిబ్బంది, రోగులకు అందుతున్న సేవల వివరాలపై ఆరా తీశారు. నిబంధనల ప్రకారం ఉంటే యథావిధిగా నడపడం, సదుపాయాలు, సిబ్బంది తక్కువగా ఉంటే తీసుకోవాల్సిన చర్యలు, కావాల్సిన నిధులపై నివేదిక ఇవ్వనున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్‌ఎంవో డాక్టర్ నవీన, క్వాలిటీ కన్సల్టెంట్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ అధినేత జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో సోమవారం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## ప్రింట్ మీడియా సర్క్యులేషన్ అసోసియేషన్ కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

కరీంనగర్: జిల్లా ప్రింట్ మీడియా సర్క్యులేషన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం కరీంనగర్‌లో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మాటేటి రవీందర్, అధ్యక్షుడిగా మంచాల రాజు, ప్రధాన కార్యదర్శిగా రంగిశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా ఈరమల్ల రమేశ్, ఉపాధ్యక్షులుగా చిందం రాజేంద్రప్రసాద్, అమరపాల్ రెడ్డి, పూసల శ్రీనివాస్, పింగళి నరేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా అలిగిరెడ్డి సతీశ్ రెడ్డి, ఎంగల ఓంకార్, కార్యవర్గ సభ్యులుగా గుండా రాజేంద్రప్రసాద్, శ్రీపాద వెంకటేశ్, మొండయ్య, పడాల రాజశేఖర్, సంతోష్ రెడ్డి, రమేశ్, మధుకర్, వేణుగోపాలచారి, సంపత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ, కార్యదర్శి పచ్చునూరి రాజేందర్, కోశాధికారి సాయిరాంప్రసాద్ తదితరులు సన్మానించారు.

## పాఠశాలల్లో చోరీ

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని అర్పపల్లిలో గల రెండు ప్రభుత్వ పాఠశాలల్లో చోరీ జరిగిందని ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అర్పపల్లి చాకలివాడ, బెస్తవాడ ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయులు గత శనివారం సాయంత్రం తాళాలు వేసి, వెళ్లిపోయారు. టీచర్లు, సిబ్బంది సోమవారం ఉదయం వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి, ట్యాబ్‌లు, చార్జర్, కేబుల్, షటిల్ బ్యాట్స్, క్రికెట్ సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించారు. చాకలివాడ పాఠశాల నుంచి రూ.30,799, బెస్తవాడ స్కూల్ నుంచి రూ.29,599 విలువైన సామగ్రి దొంగతనం జరిగిందని తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# మళ్లీ బై నంబర్ల పరిహారం !

- కలెక్టరేట్ నుంచి ఎస్డీసీ అకౌంట్‌కు డబ్బులు
- గతంలో గ్రామస్తుల ఫిర్యాదుతో నిలిచిన చెక్కులు



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ఇళ్ల ముంపు పరిహారం పొందేందుకు బోయినపల్లి మండలం వరదవెల్లి అనుబంధ రాజన్నపేటలో వివాదాస్పదమైన విషయం తెలిసిందే. అప్పటికే పరిహారం పొందిన ఇళ్ల నంబర్లకు బై నంబర్లు వేసి దాదాపు రూ.1.80కోట్లు పరిహారంగా పొందేందుకు చేసిన ప్రయత్నాలు గ్రామస్తుల ఫిర్యాదుతో ఆగిపోయిన విషయం తెలిసిందే. అయితే ఆ పరిహారం పొందేందుకు మళ్లీ ప్రయత్నాలు మొదలయ్యాయి. తాజాగా మరోసారి 9 ఇళ్లకు సంబంధించిన రూ.1.80 కోట్ల మేర పరిహారం డబ్బులు కలెక్టరేట్ నుంచి ఎస్డీసీ ఖాతాకు బదిలీకావడంతో దుమారం లేచింది. బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మిడ్‌మానేరులో ముంపునకు గురైన నిర్వాసితులకు పలు రకాల పరిహారాలు చెల్లించారు. కొందరు గతంలో పరిహారం పొందినా ఇంటి బై నంబర్లు ఉన్నట్లు రికార్డుల్లో చూపుతూ మరో రూ.2కోట్లు పరిహారం పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**9 ఇళ్లకు బై నంబర్లు ?**

వరదవెల్లి పునరావాసకాలనీలో సుమారు 478 వరకు ఇంటి నంబర్లు ఉన్నాయి. 2006 నుంచి మిడ్‌మానేరు ప్రాజెక్టు ఇళ్లు, భూముల ముంపును గుర్తించారు. ఆ సమయంలో ముంపునకు గురయ్యే ఇళ్లకు 2014లో ఎంఎంఆర్ నంబర్లు వేసి నోటీసులు ఇచ్చారు. మళ్లీ నిర్మిస్తే పరిహారం వర్తించదని స్పష్టం చేశారు. కొందరు అప్పుడే ఇళ్లను ఆనుకుని రేకులషెడ్లు, పశువుల పాకలు నిర్మించినట్లు సమాచారం. తప్పిపోయిన ఇళ్లకు పరిహారం ఇవ్వాలని 2021లో గత ప్రభుత్వం జీవో ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ జీవోను సాకుగా చూపి గతంలో నిర్మించిన ఇళ్ల ఇంటి నంబర్లకు తోడు పక్కకు షెడ్లకు అదనంగా బై నంబర్లు వేయించుకున్నట్లు సమాచారం. 2022లో ఇలా ఆ 9 ఇళ్ల గెజిట్ అయినట్లు సమాచారం. కాగా 9 ఇళ్లకు బై నంబర్లు వేసి అక్రమంగా పరిహారం పొందే ప్రయత్నాలు చేస్తున్నారని కొందరు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

**అసెస్‌మెంట్ డిమాండ్ రిజిష్టర్లే ఆధారం**


కొద్దిరోజులుగా వరదవెల్లి అనుబంధ రాజన్నపేటలో బై నంబర్లు ఉన్న 9 ఇళ్ల వారు పరిహారం కావాలని జిల్లా అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈక్రమంలో కలెక్టరేట్ నుంచి ఎస్డీసీ అకౌంట్‌లోకి సుమారు రూ.2కోట్లు జమచేశారు. దీంతో రాజన్నపేటలో 9 ఇళ్ల ఇంటి నంబర్లు, ఇంటి పన్నుల రసీదులు సేకరించేందుకు ఎస్డీసీ ప్రయత్నిస్తున్నారు. ఇళ్ల వివరాలకు సంబంధించి పూర్తి నివేదిక కావాలని డీపీవోను కోరినట్లు ఎస్డీసీ చెప్పారు. జీపీ అసెస్‌మెంట్ డిమాండ్ రిజిష్టర్ తెప్పించుకుని సరైన వివరాలు సేకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. డీపీవో విచారణ నివేదిక వచ్చిన తరువాత కలెక్టర్‌కు రాసి అప్రూవల్ తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఎస్డీసీ, డీపీవోల విచారణ నివేదికల్లో ఏం తేలనుందో అనే చర్చ సాగుతోంది. ఈ విషయంలో డీపీవో వీరబుచ్చయ్య వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

**డీపీవో విచారణ నివేదిక అందలేదు**

వరదవెల్లి అనుబంధ గ్రామం రాజన్నపేటలో 9 ఇళ్ల పరిహారం విషయంలో డీపీవో విచారణ నివేదిక అందలేదు. 9 ఇళ్లకు సంబంధించిన అసెస్‌మెంట్ డిమాండ్ రిజిష్టర్లు తెప్పించుకుని పరిశీలిస్తాం. డీపీవో విచారణ నివేదిక పరిశీలించడంతోపాటు అసెస్‌మెంట్ రిజిష్టర్ల పరిశీలన చేసిన కలెక్టర్ ఆదేశాలతో నిర్ణయం తీసుకుంటాం.

– రాధాబాయి, ఎస్డీసీ, సిరిసిల్ల

## గ్రీవెన్స్ డేకు 18 ఫిర్యాదులు



సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు 18 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి సమస్యలు త్వరగా పరిష్కరించాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది భూతగాదాల్లో జోక్యం చేసుకోవద్దని సూచించారు.

## రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ రద్దు

కరీంనగర్‌టౌన్: ఆలిండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు బీరెడ్డి కర్ణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలో ఉన్న చాలా మంది సంఘం పటిష్టతకు పని చేయడం లేదన్నారు. అందుకే రద్దు చేస్తున్నామని, త్వరలోనే కొత్త కమిటీని నియమిస్తామని పేర్కొన్నారు.

# హలో.. రాయికల్ పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్న..

- రూ.5 వేలు తెస్తావా.. లోపల వేయమంటవా?
- పోలీసుల పేరుతో యువకుడి హల్‌చల్
- న్యాయం కోసం వెళ్తే పట్టని పోలీసులు
- రిజిస్టర్ పోస్టు ద్వారా ఎస్పీ, డీఎస్పీకి బాధితుల ఫిర్యాదు



రామోజీపేటలో నిరసన తెలుపుతున్న యువకులు

జగిత్యాలక్రైం: 'హలో నేను రాయికల్ పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్న.. నీ పేరేంటి..? ఎక్కడున్నవ్..? నీ నాన్న పేరేంటి..? ఏంర్రా.. మర్యాద ఇవ్వాలని తెల్వదా..? లోపల వేస్తా..' అంటూ ఓ యువకుడు పోలీసుల పేరుతో పలువురిని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగడం లేదంటూ బాధితులు సోమవారం ఎస్పీ, డీఎస్పీకి రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. రాయికల్ మండలం రామోజీపేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అదే గ్రామానికి చెందిన కొందరికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఫోన్ లిఫ్ట్ చేసిన బాధితులు 'హలో చెప్పు.. ' అంటే ఏంర్రా.. 'హలో చెప్పు.. అంటున్నావు..' అంటూ దుర్భాషలాడుతున్నారు. రూ.5వేలు తీసుకొస్తావా.. లేకుంటే లోపలేయమంటావా..? అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీంతో బాధితులు విచారణ చేపట్టి, సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినా, పోలీసులు పట్టించుకోకపోవడంతో రూరల్ సీఐని కలిశారు. ఆయన కూడా చర్యలు తీసుకోకపోవడంతో గ్రామానికి చెందిన యువకులు, మహిళలు సోమవారం నిరసనకు దిగారు. రిజిస్టర్ పోస్టు ద్వారా ఎస్పీ, డీఎస్పీకి ఫిర్యాదు పంపించారు.

# దుబాయ్ నుంచి వచ్చి.. భార్యను హతమార్చి..

- క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భర్త



జల (ఫైల్)



విగతజీవిగా పడి ఉన్న రాయంచు జల

మేడిపల్లి: దుబాయ్ నుంచి వచ్చిన రోజే భార్యను హత్య చేశాడో భర్త. అనంతరం తానూ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పోలీసులకు లొంగిపోయాడు. ఈ సంఘటన మేడిపల్లి మండలం తొంబరావుపేటలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాయంచు లింగం, జల దంపతులు. వీరికి కూతురు, కుమారుడు సంతానం. కూతురుకు పెళ్లయ్యింది. కుమారుడు ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. దంపతులు తమకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం లింగం కూడా ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అప్పటినుంచి జల ఇంట్లో ఒంటరిగా ఉంటూ వ్యవసాయం చేసుకుంటోంది. ఆదివారం గల్ఫ్ నుంచి వచ్చిన లింగం రాత్రి సమయంలో భార్యతో గొడవ పడ్డాడు. ఏం జరిగిందో తెలియదుగానీ భార్య నిద్రిస్తున్న సమయంలో పారతో తలపై బాదాడు. దీంతో తీవ్రంగా గాయపడిన జల మంచంపైనే మృతిచెందింది. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్న లింగం సోమవారం వేకువజామున క్రిమి సంహారక మందు తాగి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. దీంతో పోలీసులు వెంటనే లింగంను చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరి బింగిసారం విజయ ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజు తెలిపారు. హత్యకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కొత్త న్యాయ చట్టాలు అమల్లోకి వచ్చాక మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇది మొదటి హత్యకేసు అని కోరుట్ల ఇన్‌చార్జి సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు.

# కామన్ టైమ్ టేబుల్ మార్చాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి గురుకుల టీచర్ల వినతి
- సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన మంత్రి



కేంద్రమంత్రి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న గురుకుల టీచర్లు

కరీంనగర్‌టౌన్: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో కామన్ టైమ్ టేబుల్‌ను మార్చాలని, ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని గురుకుల మహిళా టీచర్లు కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన సీఎంకు లేఖ రాశారు. అందులో గురుకులాల్లో ఉద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నం.16 ప్రకారం తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలల రోజువారీ షెడ్యూల్ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉందని, ఈ కొత్త కామన్ టైమ్ టేబుల్ అమలుతో టీచర్లు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పిల్లలకు అల్పాహారం, రాత్రి భోజనం, క్రీడలు, వ్యాయామం, వ్యక్తిగత పరిశుభ్రత, ముఖ్యంగా నిద్రించడానికి తగినంత సమయం దొరకడం లేదన్నారు. ఇది పూర్తిగా అశాస్త్రీయమైందని, టీచర్లు, విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతూ అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతీరోజు రాత్రి స్టడీ అవర్ ముగిసిన తర్వాత ఉద్యోగులు తమ ఇళ్లకు వెళ్లాలంటే నానాతంటాలు పడుతున్నారని తెలిపారు. గురుకులాల్లో వార్డెన్లు, అసిస్టెంట్ కేర్ టేకర్లు లేకపోవడంతో నైట్ స్టడీ అవర్స్, రాత్రిబస సహా కేర్ టేకర్ విధులను సైతం టీచర్లే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇది సమంజసం కాదని, పాఠశాలల పనివేళలను కుదించాలని లేఖలో పేర్కొన్నారు.

# అట్టహాసంగా 'అల్ఫోర్స్' కల్చరల్ ఫెస్టా



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ కల్చరల్ ఫెస్టా వేడుకలు సోమవారం అట్టహాసంగా సాగాయి. విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతిప్రజ్వలన చేశారు. కళల ద్వారా ఆనందంతోపాటు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు కళలపై ఆసక్తి పెంపొందించేందుకు సాంస్కృతిక, క్రీడా తదితర రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం తన పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



విద్యార్థులతో విద్యాసంస్థల చైర్మన్ ఫాతిమారెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ (సీబీఎస్‌ఈ)కు చెందిన 9 మంది విద్యార్థులు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించినట్లు విద్యాసంస్థల చైర్మన్ పి.ఫాతిమారెడ్డి తెలిపారు. పి.సుశీల్‌కుమార్ 118 ఎలిమెంట్స్ 3 నిమిషాలు, హనియ 50 చెట్ల సైంటిఫిక్ పేర్లు 3 నిమిషాలు, భరత్‌కుమార్ 50 త్రికోణమితి నిష్పత్తులు 54 సెకన్లు, సిరి 50 స్క్వేర్ రూట్స్ 3 నిమిషాలు, దీక్షిత 50 కెమికల్ ఫార్ములాలు, రిత్విక్ సాయి షెల్టర్స్ ఆఫ్ 50 ఎనిమల్స్, అద్వికానాథ్ స్క్వేర్ నంబర్స్ 1 నుంచి 100 వరకు, వర్షిత 50 సైంటిఫిక్ ఫిట్ ఇన్వెంటర్స్ 4 నిమిషాల 20 సెకన్లు, వైష్ణవి ఆథర్స్ 50 పుస్తకాల రచయితల పేర్లు చెప్పి, ఈ ఘనత సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు.

# జర్మనీలో నర్స్ ఉద్యోగాలు

సిరిసిల్లకల్చరల్: జర్మనీలో నర్స్ ఉద్యోగాలకు ఈనెల 9 నుంచి 17 వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు టామ్‌కామ్ సీఈవో కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇంటర్వ్యూలు హైదరాబాద్‌లోని బేగంపేట ప్లాజా హోటల్‌లో జరుగుతాయని తెలిపారు. జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత, 18 నుంచి 38 ఏళ్లలోపు వయసు వారు అర్హులు అని పేర్కొన్నారు. ఎంపికైన వారు భాష శిక్షణను పూర్తి చేసుకున్నాక జర్మనీలో నర్సింగ్ అసిస్టెంట్‌గా పని చేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వీసా, ఇమ్మిగ్రేషన్ వన్ వే ఫ్లైట్ టికెట్ ఉచితంగా అందజేయనున్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు 99088 30438 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.